కొత్తగా దిగినారేటి?" అన్నాడు వాడు మళ్ళీ అక్కడే నిలబడి కదలకుండా.

"అయ్యో రామ! ఈ వివరాలన్నీ చెబుతూ కూర్చోడానికి నాకు టైమ్‌లేదు బాబూ! అందుకని నువ్వు దయచెయ్యి-" అని మళ్ళీ ఒక క్షణం ఆగి,

"నీకు తెలీదేమిట్రా సూరయ్యా! ఆవిడ ఆ భాగంలోకి దిగి రెండునెలలైంది. అప్పట్నుంచి మీసుబ్బులేగా పని చేస్తోంది! నీతో చెప్పలేదా ఏమిటీ! ఆ డబ్బులన్నీ తీసుకుని హాయిగా సినీమాలు చూసేస్తోంది కాబోలు. అసలు ఈ మధ్య అది చాలా మారిపోయింది, చెప్పినమాటవిననేవినదు. ఇంకో నెల చూసి మా వూరునుంచే పని మనిషిని పిలుచుకొచ్చుకుందామని చూస్తున్నాను. అక్కడికీ దీనికి నెలకిరవై రూపాయలిస్తున్నానా? మిగిలిన అన్నం పెడుతున్నానా-" ఆవిడ వాగ్ధాటి నిరాఘాటంగా ప్రవహిస్తోంది. మనుష్యులని రెచ్చగొట్టడం అనేది చాలా గొప్ప నేర్పు ఆ నేర్పు అందరికీ వుండదు. అది ప్రక్కింటి ఇల్లాలికి ఉగ్గుతో అబ్బిన విద్య అనుకుంటే తప్పుకాదు - వాడు - సారీ సూరయ్య-గబగబ రెండడుగుల్లో నా గది ముందు నిలబడి, "ఒసేవ్ సుబ్బులూ!" అని గర్జించాడు.

సుబ్బులు బాత్‌రూంలో నుంచి వణికి పోతూ బయటికి వచ్చింది. వేటగాణ్ని చూసి బెదిరిపోయిన లేడిపిల్లలా కళ్ళు రెపరెప లాడించింది.

"నేను నిస్సహాయంగా నిలబడి పోయాను.

"రాబయటికి!" అరిచాడు సూరయ్య.

"ఎందుకేటి?" ధైర్యం కూడగట్టుకుంది సుబ్బులు.

"ఈడ రెండునెల్లు కాన్నించి పని చేస్తున్నావటగా! డబ్బంతా ఏంజేసినావ్?"

దాని సంపాదనమీద అధికారం వాడిదే అయినట్లు నిలదీసి అడిగాడు.

సుబ్బులు వణికే పెదవుల్తో ఏదో చెప్పాలని వ్యర్థప్రయత్నం చేసింది.

గదిలో తను వున్నంతసేపూ భద్రత వుంటుందని గ్రహించినట్లుంది సుబ్బులు. సూరయ్య గడప దాటి లోపలికి రాలేదు.




